రెండు రోజుల్లో పీ-4 మార్గదర్శుల మ్యాపింగ్ పూర్తి కావాలి : కలెక్టర్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : రెండు రోజుల్లో పీ-4 మార్గదర్శుల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులకు నిర్దేశించారు. పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సేవకులు, ఇతర వ్యాపార కార్యకాలాపాల నిర్వహించే వారిని గుర్తించి బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ చేయాలని చెప్పారు. సమాజంలో ఎగువ స్థాయిలో ఉన్న వారంతా, దిగువ స్థాయిలో ఉన్నవారిని దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని, తగిన సహకారం అందించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారుతో ఆయన మాట్లాడారు. రోజుకో గంట పీజీఆర్ఎస్ కోసం కేటాయించాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో మనసు పెట్టి పని చేయాలని కలెక్టర్ హితవు పలికారు. ఆయనతో పాటు జేసీ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

దబ్బంద టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి : సీపీఐ ధర్నా

విశాలాంధ్ర-విశాఖ : దబ్బంద టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు రద్దుచేయాలని, ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ దబ్బంద టిడ్కో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రెహమాన్ మాట్లాడుతూ దబ్బందలో టిడ్కో ఇళ్లకు బ్యాంకు రుణాలను రద్దు చేయాలని, టిడ్కో ఇళ్లకు వద్ద వీధి లైట్లు, మంచినీరు, రోడ్లు, ఆసుపత్రి, ఆటస్థలం, స్కూలు, స్మశాన వాటిక, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కేటాయింపు పత్రాలు ఇచ్చినప్పటికీ ఎటువంటి సౌకర్యాలు లేక చాలా మంది లబ్ధిదారులు దబ్బంద వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోపక్క అద్దె ఇళ్లలో ఉంటూ అద్దె చెల్లించకోలేక సొంతింటి కల నెరవేరక టిడ్కో ఇళ్లకు ఇచ్చిన రుణాలు సకాలంలో చెల్లించలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. 2022లో వైసీపీ ప్రభుత్వం బ్యాంకు రుణాలు ఇప్పించి 2024 వరకూ కట్టొద్దని చెప్పిందని అన్నారు. అయితే బ్యాంకులు ముక్కు పిండి కట్టించుకుంటున్నాయని అన్నారు. లబ్ధిదారుల కట్టిన డబ్బులు వడ్డీగా జమ చేసుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల ఆర్థికంగా లబ్ధిదారులు నష్టపోతున్నారని అన్నారు. వినతి పత్రాలను మేయర్, జీవీఎంసీ కమిషనర్ లకు ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు మేయర్, కమిషనర్ హామీ ఇచ్చారు. దబ్బందలో పర్యటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.భానుప్రతాప్ పి.ఈశ్వరరావు, నారాయణ, రవణమ్మ, ఎన్.గోవిందు, నూకరత్నం, పి.శ్రీను వాసు రావు,బి.శ్రీను వాసురావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మధరావు, సీఎం.క్షేత్ర పాల్ ఎన్. నాగభూషణ్ జిల్లా సమితి సభ్యులు సిహెచ్. కాసుబాబు, ఆరిలోవ ఏరియా కార్యదర్శి కె.లక్ష్మణరావు బి.పుష్పలత, కే.సందీప్ ఎం.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి : ప్రజా సంఘాలు

విశాలాంధ్ర-గాజువాక : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిఐటియు నాయకులు ఎం జగ్గు నాయుడు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాజువాక సిఐటియు కార్యాలయంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నష్టదాయకమైన స్మార్ట్ మీటర్లను పెట్టకుండా అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. దీనివల్ల జరిగే నష్టాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. వీటిని వ్యతిరేకించాల్సిన పార్టీలైనటువంటి తెలుగుదేశం జనసేన వైసిపి బిజెపికి మద్దతుగా ఉన్నాయని ఆక్షేపించారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని అమలుపరుస్తున్నారన్నారు. వీటిని బిగించడానికి కూడా ప్రజల దగ్గర నుండి డబ్బులు వసూలు చేస్తారన్నారు. వీటి యొక్క టారిఫ్ లు కూడా పిక్ సమయంలో ఒక రేటు, మామూలు సమయంలో ఒక రేటు నిర్ణయించారు అని విమర్శించారు. గతంలో విద్యుత్ ఉద్యమంలో ఏ విధంగా అయితే చేసామో అదే స్ఫూర్తితో పోరాటం చేసి వీటిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు. జి ఆనంద్ మాట్లాడుతూ, ఎప్పటికీ ఉపాధి కోల్పోయి ప్రజలు వీధిన పడుతుంటే, మరోపక్క స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు మోపడానికి వీటిని అమలు చేస్తున్నారన్నారు. ఒక పైసా పెట్టుబడి లేకుండా ఆదానికి మేలు చేయడానికి ఇలాంటి విధానాలను మోడీ ప్రభుత్వం అమలు చేస్తూ ఉండడం దుర్మార్గమన్నారు. వాటిని వ్యతిరేకించాల్సిన రాజకీయ పార్టీలు వీటి పట్ల మాటలాడడం లేదన్నారు. సిఐటియు గాజువాక జోన్ నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, రీఛార్జ్ మాదిరిగా ఈ స్మార్ట్ మీటర్లు కూడా ఇళ్లల్లోకి బిగిస్తారు అన్నారు. రీఛార్జ్ అయిపోయిన వెంటనే కరెంట్ సరఫరా నిరుపదల చేస్తారన్నారు. ఈసమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అచ్యుత రావు, డి.హెచ్.పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెద పూడి దుర్గారావు, సిపిఎం నాయకులు రాంబాబు, లోకేష్, అప్పారావు, కిరటం, సంతోషం పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు పోటెత్తిన వినతులు

- వినతులు స్వీకరించిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్
- మొత్తం 427 వినతులు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్టణం జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. వివిధ సమస్యలపై మొత్తం 427 వినతులు అందించారు. అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి అత్యధికంగా 180 ఉండగా, జీవీఎంసీ 54, పోలీసు 23, ఇతర విభాగాలకు చెందినవి 170 ఉన్నాయి. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్వయంగా పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మంత్రి రాకతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు భూ ఆక్రమణలు, వ్యక్తిగత కార్యకలపాల్లో అడ్డంకిగా నిలుస్తున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు ఫిర్యాదులు సమర్పించారు.

పీజీఆర్ఎస్ నిర్వహణపై అధ్యయనం చేసేందుకే స్వయంగా వచ్చా...

పీజీఆర్ఎస్ లో స్వయంగా పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వివిధ అంశాలపై మాట్లాడారు. తిరుపతి, విశాఖపట్టణం జిల్లాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక బాగా జరుగుతుందని, సమస్యల పరిష్కారంలో కూడా సానుకూలత ఉందని, దీనిపై అధ్యయనం చేసేందుకు తనే స్వయంగా పీజీఆర్ఎస్ లో పాల్గొంటున్నానని మంత్రి పేర్కొన్నారు. ఇక్కడ అవలంబిస్తున్న విధానాలను చూసి మిగిలిన చోట్ల అమలు చేసేందుకు గాను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యాని స్పష్టం చేశారు.

రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు అంగన్వాడీల ఆవేదన

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : అంగన్వాడీలపై పని భారం తగ్గించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి కోరుతూ సోమవారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రాష్ట్రరెవిన్యూ శాఖ మంత్రి వర్యులు అనగాని సత్యప్రసాద్‌ని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా నాయకులు పడాల రమణ సారథ్యంలో పి.శ్యామలాదేవి, ఎం.వెంకటలక్ష్మి, పి.కృపారాణి, ఏ నూకరత్నంలు ప్రతినిధి బృందం అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారాన్ని కృషి చేయాలని వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ యాప్‌లతో అంగన్వాడీలు తీవ్ర మానసిక ఒత్తిడితో సతమతమవుతున్న 13 డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అందరికీ ఇల్లు పథకంలో అంగన్వాడీ వర్కర్సకి &హెల్పర్స్‌కీ తగు ప్రాధాన్యత కల్పించి సొంత ఇల్లు ఇవ్వమని కోరారు. యాప్ వాళ్ళ పని భారం పెరిగి మరోపక్క నెట్ సౌకర్యం ప్రభుత్వ ఇచ్చినటువంటి ఫోన్లు సరిగ్గా సహకరించకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాము. మాతో పాటు లబ్ధిదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ఇస్తున్న సంక్షేమ పథకాలు అవి అంగన్వాడి వర్కర్స్‌కు హెల్పర్స్‌కు ప్రభుత్వ ఉద్యోగులని ప్రభుత్వ అధికారిక సిస్టం అప్డేట్‌లో చూపడం వల్ల అన్యాయం జరుగుతుందని అంగన్వాడి వర్కర్లు హెల్ప్ లైన్ వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి జీతం పెంచండి అని కోరారు. మూలుగే నక్కపై తాటిపండు పడ్డట్టు మీద ఇప్పుడు కొత్తగా ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం పని రుద్దడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన యాప్ ను వెంటనే రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీల ఆవేదన విన్న మంత్రి సత్య ప్రసాద్ అంగన్వాడీ సేవలను ప్రభుత్వం గుర్తిస్తుందని ప్రభుత్వంతో ముఖ్యమంత్రి దృష్టికి మీ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని ప్రభుత్వ ఇల్లు ఇతర స్కీములు మీకు వర్తించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

నీటి సరఫరా విభాగంలో పెరిగిన జీతాలను వెంటనే అందించాలి

కమిషనర్‌కు యూనియన్ నేతలు వినతి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : రాష్ట్రంలోని మున్సిపల్ శాఖలో నాన్ పబ్లిక్ హెల్త్ లో నీటి సరఫరా విభాగంలో టెక్నికల్ విధులు నిర్వహిస్తు ఆప్కోస్ విధానంలో పనిచేస్తున్న కేటగిరి 1, 2, 3, ఉద్యోగుల జీతాలు పెంచుతూ జీవో నెంబర్ 124ను జూలై 21వ తేదీన ప్రభుత్వం జారీ చేయడం హర్షనీయమని , వెంటనే ప్రభుత్వ జీవోను అమలు చేయాలని, నీటి సరఫరా విభాగంలో ఉన్న టెక్నికల్ విధులు నిర్వహిస్తున్న వారికి పెరిగిన జీతాలను అందించాలని కోరుతూ సోమవారం జీవీఎంసీ కమిషనర్ కు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ , లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం ఆనందరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యం వినతిపత్రం అందజేశారు. వెంటనే కమిషనర్ స్పందించి ప్రభుత్వ జీవోను అమలు చేసి ఆగస్టు నెలలో పెరిగిన జీతాలతో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రెవెన్యూ మంత్రికి ఏఐటీయూసీ వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఉన్న రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ని కలిసి వినతిపత్రం అందించారు. సమస్యలు విన్న మంత్రి రాష్ట్ర మంత్రివర్గంలో ఈ విషయాన్ని సంబంధిత మంత్రి దిష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ధర్నా ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటియుసి) రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ చట్టం 1996 ను 2006 సంవత్సరం నుండి మన రాష్ట్రంలో అమల్లోకి తెచ్చి గత ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు 12 రకాల సౌకర్యాలు కల్పించి లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా క్లైములు పరిష్కారం చేసి కార్మికుల జీవితాలలో వెలుగులు నింపారు కానీ 2019 సంవత్సరంలో జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ జీవో నెం: 1214 ను ప్రవేశపెట్టి కార్మికులకు అన్యాయం చేసి బోర్డు నిధులు ప్రభుత్వ అవసరాలకు వాడుకొని సుమారు 46వేల క్లైములకు నిధులు మంజూరు చేయకపోవడం వలన కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా రు అన్నారు . అదే సమయంలో జరిగిన అనేక భవన నిర్మాణం కార్మిక పోరాటాలలో ప్రత్యక్షంగా పరోక్షంగా కార్మికుల బాధలను తెలుసుకున్న కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకుంటామని ప్రకటించి గెలిచిన తర్వాత ఈరోజు వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకుండా , కనుక మా యందు దయవుంచి కార్మికుల సంక్షేమ పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు . ఎన్నికల ముందు తర్వాత రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మికులు నా మానసిక పుత్రులు అని వారు సంక్షేమకు మొదటి ఫైల్ మీద మా సంతకం పెడతామని తాను కూడా సొంతంగా కోటి రూపాయలు బోర్డు ఆర్థిక సాయం అందిస్తున్నారని అనేక సభలలో చెప్పినప్పటికీ ఆచరణలో ఎటువంటి చర్యలు కనబడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే మా కష్టాలు కొన్ని తీరుతాయని అనుకున్న కార్మికుల ఆశలన్నీ ఆవిరి అయిపోయాయని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఇతర రాష్ట్రాలలో మాదిరిగా ప్రభుత్వ స్కీములతో సంబంధం లేకుండా వెల్ఫేర్ బోర్డు ద్వారా గతంలో రద్దు చేసినటువంటి స్కీములన్ని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాభవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కోట సత్తిబాబు, నాయకులు వైయస్ మూర్తి, జీ నూకరాజు, యోగేశ్వరరావు, నామాల రాము, కేశవయ్య, అప్పారావు, పిల్ల రమణ, ఎల్లాజీ, శివారెడ్డి, అప్పలనాయుడు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎస్.టి.ఎల్‌లో ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-సింహాచలం : గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్.ఎస్.టి.ఎల్, డి.ఆర్.డి.ఓ లో దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం 10వ వర్ధంతి వేడుకలు జరిగాయి. సంస్థ అత్యుత్తమ శాస్త్రవేత్త & డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్‌బీ అత్యుత్తమ శాస్త్రవేత్త & అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్. ఎన్ దాస్, ఇతర సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి ఎన్. ఎస్.టి.ఎల్‌తో ఆయన అనుబంధాన్ని గుర్తు చేసు కున్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది, సివిల్ ఎంప్లాయిస్ యూనియన్, వర్క్స్ కమిటీ ప్రతినిధులు సహా ఉద్యోగులు పాల్గొని గొప్ప దార్శనికుడు, ప్రజల అధ్యక్షుడికి పుష్పగుచ్ఛాలు అర్పించారు. **చిత్రం:** డాక్టర్ అబ్రహం వర్గీస్, డాక్టర్ హెచ్‌ఎన్ దాస్, శాస్త్రవేత్తలు, డాక్టర్ అబుల్ కలాం విగ్రహం వద్ద ఎన్‌ఎస్టిఎల్ అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు.

గండ్రెడ్డికి ఘన సత్కారం

విశాలాంధ్ర-ఆనందపురం : అంతర్జాతీయ సాహితీ, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో, నిర్వహించిన 150వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం విశాఖపట్నం శుభం ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భీమిలి నియోజకవర్గానికి చెందిన అధ్యాపకుడు, కవి గండ్రెడ్డి రామక్రిష్ణ నాయుడు వ్రాసిన కర్పూర కన్నీళు కవితను కవిత గానం చేసినందుకు, తెలుగు భాష మర సంస్కృతికి తన సాహిత్యం ద్వారా కృషి చేస్తున్నందుకు, శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో సత్కారం చేశారు. ఈసందర్భంగా జీఆర్‌కె నాయుడు కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి పైప్ లైన్ లీక్

వృధాగా పోతున్న మంచినీరు

విశాలాంధ్ర-అనందపురం : మండలంలో బంటుపల్లి వారి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శుభ శ్రీ కళ్యాణ వేదిక ప్రక్కనే రహదారి కి ఆనుకొని ఉన్న మంచినీటి పైప్ లైన్ గత 3 రోజులుగా చెడిపోవడంతో త్రాగునీరు అంతా వృధాగా పోతూ రోడ్డుపైన ప్రవహిస్తుంది. త్రాగునీరు శుభ్రంగా వాడుకోవలసిన బాధ్యత ప్రతిఒక్కరు పైన ఉంది అటువంటి మంచినీరు వృధాగా పోతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు చొరవ తీసుకొని పైప్లైన్ మరమ్మత్తులు వెంటనే చేపట్టాలనిపలువురు కోరుతున్నారు.

చెట్టుని ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - అనందపురం : మండలంలోని గిడిజాల సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందాడు. వివరాల ఇలా ఉన్నాయి, పెందుర్తి మండలం వేపగుంటలోని ముత్యమాంబ కాలనీకి చెందిన మామిడి ప్రదీప్ అలియాస్ వందు (26) మోటార్ సైకిల్‌పై పద్మనాభం నుండి నేలకుండిల వైపు వస్తుండగా, గిడిజాల వద్ద అతని వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ప్రదీప్ తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మరణించాడు. ప్రదీప్ మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ బేసిస్‌పై మెకానిక్‌గా పనిచేస్తున్నాడు ప్రమాద సమాచారం అందుకున్న ఆనందపురం సీఐ వాసునాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ శివ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆదర్శ్ కళాశాల'లో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం

విశాలాంధ్ర-పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎస్ ఈ ఫ్లోరా తెలియజేశారు. హెపటైటిస్ కాలేయంపై ఎక్కువ ప్రభావం చూపుతుందని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రదీప్ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజు కుమార్ మంచి నిద్ర, మంచి ఆహారం అవసరం అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మాధవి, భాగ్యశ్రీ, కళ్యాణి, చందన, గాయత్రి, హేమ, ప్రియ హెపటైటిస్ కు సంభందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ టి. థియోఫిలస్, ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, వైస్ ప్రిన్సిపాల్ రాజు కుమార్, ఏఓ రవిబాబు, ఎన్ఎస్-ఎస్ ఆఫీసర్ మంజుల, ప్రదీప్, హిస్టరీ లెక్చరర్ డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు. ఈ హెపటైటిస్ డే కార్యక్రమాన్ని కోఆర్డినేట్ చేసిన సెకండ్ ఇయర్ బిఎస్సి విద్యార్థిని రోస్లిన్ ను కరస్పాండెంట్ అభినందించారు.

వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహణ

విశాలాంధ్ర-మల్కాపురం : పారిశ్రామిక్ ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఎం నాయకులు కే పెంటారావు అధ్యక్షత వహించారు పశ్చిమ నియోజకవర్గం సిపిఐ పార్టీ కాంద్రేకుల సత్యాంజనేయ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన వెంటనే వెనక్కి తీసుకోవాలని, ట్రూ ఆఫ్ చార్జీలు, అదనపు సార్జీదు రద్దు చేయాలని వామపక్షాల డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయటానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు జూలై 31 సాయంత్రం 4:30 నా మల్కాపురం నుండి గాజువాక డిపో వరకు ప్రదర్శన జరుగుతుంది. ఈ ప్రదర్శనకు ప్రజాసంఘాలు వామపక్ష పార్టీలు ఇతర సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సిపిఐ నాయకులు గుడాల రాంబాబు, ఏఐటీయుసి నాయకులు గండి అప్పారావు, మహిళా సమైక్య నాయకులు గుడాల జయ సిపిఎం నాయకులు పైడిరాజు, సత్యారావు సిఐటియు నాయకులు, ఐద్వా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలపై పోరాడండి

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం సీతంపేట పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు నాగబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు నాగబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలు వైసీపీ పార్టీ అరాచకాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మరో 20 సంవత్సరాలు వైసిపికి అవకాశం లేదని తెలిపారు. కూటమి సమన్వయంతో సమర్థవంతంగా పరిపాలిస్తుందని, చిన్న లోపాలు ఉంటే వాటిని సమన్వయ కమిటీ పరిష్కరిస్తుందని తెలిపారు. తాను ఎటువంటి పదవి మీద ఆశ లేదని కార్యకర్తగా పనిచేయడం ఇష్టం అని తెలిపారు. రానున్న రోజుల్లో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో జనసేన కార్యకర్తలు పలకరిస్తారని వివరించారు. అదేవిధంగా ఉత్తరాంధ్రలోనే ఉంటూ నెలలో ఐదు నుంచి పది రోజులు ఉత్తరాంధ్ర జనసేన కార్యకర్తలతో అందుబాటులో ఉంటానని తెలిపారు. జనసేనకు దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులు వస్తాయని మరి కొద్ది సేపు రోజుల్లో జనసేన సభ్యత్వ నమోదు కూడా ప్రారంభం చేస్తామని తెలిపారు. కూటమి సమన్వయంతో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంకా ఐదు సంవత్సరాలు ఎమ్మెల్సీ పదవి మిగిలి ఉండగానే జనసేన పార్టీలోకి రావడానికి ముఖ్య కారణం నాగబాబుని, నాగబాబు వల్లే ఈరోజు నేను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిచానని తెలిపారు. జనసేన పార్టీకి, పవన్ కళ్యాణ్‌కి రుణపడి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, జనసేన సీనియర్ నేత బొలిశెట్టి సత్యనారాయణ, డిసిసిబి చైర్మన్ కోనా తాతారావు, పలువురు కార్పొరేటర్లు వివిధ హోదాల్లో ఉన్న జనసేన పార్టీ శ్రేణులు, జన సైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా బృహత్ ప్రణాళిక రహదారుల నిర్మాణం

వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర-విశాఖ : గడువులోగా బృహత్ ప్రణాళిక రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాధన్ ఆదేశించారు. అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మాస్టర్ ప్లాన్ రహదారుల్లో కొన్ని పనులు ఇప్పటికే చేపట్టగా మిగిలిన రహదారుల పనులను త్వరలోనే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నాణ్యతలో రాజీ వద్దని ఆదేశించారు. అనంతరం జరిగిన ప్రజా దర్బార్ కి పలువురు బాధితులు మాస్టర్ ప్లాన్ పై వినతులు సమర్పించారు. సబ్బవరం, కోడూరులను అనుసంధానించే బృహత్ ప్రణాళిక రహదార్లను నిర్మించాలని పలువురు వినతులు సమర్పించారు. ప్రజా దర్బార్‌కి మొత్తం 10 వినతులు రాగా వాటిలో ప్లానింగ్-6, పరిపాలన-2, ఇంజనీరింగ్-2 వచ్చాయి. జాయింట్ కమిషనర్ కె.రమేశ్, కార్యదర్శి మురళీ కృష్ణ, సీయూపీ శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ...!

సర్వే నెంబర్ 128లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలో వేములవలస రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. సర్వే నెంబర్ 128లో సత్య కళ్యాణ్ అపార్ట్మెంట్ సమీపంలో జాతీయ రహదారి ఆనుకొని కొందరు వ్యక్తులు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదివరకు నిర్వహించిన రీ-సర్వేలో ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను తొలగించి నూతనంగా రోడ్డు నిర్మిస్తున్నారు. అయితే ఈ



ప్రాంతంలో ఉన్న సర్వే నెంబర్లు 127 మరియు 128 మధ్య భాగంలో బోనీ నుండి విశాఖ జీవీఎంసీ కి వెళ్లే వాటర్ లైన్ ఉండటంతో దాని ఇరువైపులా 20 అడుగుల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని రెవెన్యూ నిబంధనలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. విషయం తెలిసిన కొందరు స్థానికులు నిర్మాణాలపై ప్రశ్నించగా, పైప్‌లైన్ తవ్వన గోతులను మట్టి వేసి కప్పి మరోవైపు నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ చేపడుతున్న ఈ ఆక్రమణలపై అధికారుల దృష్టి చేరాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు పరిశీలించి ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికలు కోరుతున్నారు.

28వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులకు నగర మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ 3వ జోన్ 28వ వార్డు పరిధిలోని రామ్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ మరమ్మత్తులు, నిర్మాణ పనులకు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, వార్డ్ కార్పొరేటర్ పల్లా అప్పలకొండతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగరాభివృద్దే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు జీవీఎంసీ అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. 28వ వార్డులో జీవీఎంసీ నిధులతో రామ్‌నగర్‌లోని నెహ్రూ నగర్ సచివాలయం, దుర్గా మల్లేశ్వరి గుడి తదితర ప్రాంతాలలో సుమారు రూ.39.72 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ, మ్యాన్ హోల్స్ మరమ్మత్తులు, నూతనంగా నిర్మించేందుకు శాసనసభ్యులతో కలిసి భూమి పూజ చేసామన్నారు. అనంతరం తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖను ఆర్థిక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, ముఖ్యంగా నగరంలో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్తు, రోడ్లు, కాలువలు, పారిశుధ్యం, భూగర్భ మురుగునీటి వ్యవస్థ మొదలైనవి అభివృద్ధి చేస్తే విశాఖకు అధిక శాతం పెట్టుబడి వస్తుంది అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షులు నక్కా కనకరాజు, అన్నపూర్ణ, పల్లా దుర్గ, శ్యామల, ఉరుకూటి పైడిరాజు, ఢిల్లేశ్వరి, జీవీఎంసీ సహాయక ఇంజనీరు విల్సన్, వార్డు సచివాలయం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల తగాదాల పరిష్కార కమీషన్
ఫే ఆ నో. 479 ఆఫ్ 2024
ప్రమోరికా లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్
...అప్పిలెంట్/ప్రతివాదులు
అండ్
1. మాచర్ల వెంకటేష్
2. ఆధార్ హౌసింగ్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్
...రెస్పాండెంట్/వాది
ఆధార్ హౌసింగ్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్, రిప్రెసెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్, ఫస్ట్ ఫ్లోర్, రామ్స్ ప్లాజా నో.211-బిప్ 102 ఫస్ట్ ఫ్లోర్ ద్వారకా నగర్, విశాఖపట్నం- 530016.
గౌరవ కమీషన్ వారి అనుమతితో తెలియజేయునది ఏమనగా పైన ఉదహరించిన అప్పీల్‌లో అప్పీళ్లనట్లు సి.సి. నో. 258 ఆఫ్ 2021 అప్పీల్ దాఖలా చేసియున్నారు. మీకు పలుమార్లు నోటీసు పంపినప్పటికీ మీరు హాజరు కావడం లేదు. సదరు కమీషన్ వారి ఉత్తర్వుల మేరకు, మీకు నోటీసును పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయు చున్నాము.
అప్పీల్ వాయిదా: 11-08-2025
మీరు గానీ మీ తరఫున ప్లీడర్ గారు కానీ పైన చూపిన వాయిదా నాడు గౌరవ కమీషన్ ముందు హాజరు కావలెను.
ఇట్లు
జాగర్లపూడి వెంకటేశ్వరప్రసాద్
జాగర్లపూడి లక్ష్మీ శివనారాయణ
అడ్వకేట్స్
41-5-16 ఓల్డ్ పోలీస్ స్టేషన్ రోడ్
కృష్ణలంక, విజయవాడ-520013
సెల్: 9440696216

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ జీవితం ఆదర్శం కావాలి

విశాలాంధ్ర-విశాఖపట్నం : ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ పేరు మీద ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం జులై 28న ఎంఎస్ఎంఈ అవార్డులు ఇవ్వాలని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. సోమవారం ఉదయం ఎం.వి.వి.విప్రెసిడెన్సీ, పాత వెంకోజీపాలెం విశాఖపట్నం లో ఆయన 104వ జయంతి సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ 24 ఏళ్ళ వయసులోనే ఆంధ్రా షుగర్స్ స్థాపించిన ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ జీవితం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు కు ఆదర్శం కావాలని, ఆయన స్ఫూర్తితో పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకురాలు పాలూరి శేషమాంబ, డాక్టర్ పప్పూర్ నికుంజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతిగా భాషిల్లుతున్న పెందుర్తి వెంకటాద్రిపై సోమవారం గోదా అమ్మ వారి తిరు నక్షత్రం(పుట్టిన రోజు) వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం 7.30 కి గోదా అమ్మ వారికి పంచామృత అభిషేకం, దివ్య ప్రభంద పారాయణ, వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోదా అమ్మ వారికి విశేష పూజలు, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేసి ఆశీర్వదించారు.

ఎమ్మెల్సీ నాగబాబుని కలిసిన 1వ వార్డు అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి

విశాలాంధ్ర-తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు జనసేన పార్టీ అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి సోమవారం భీమిలి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇంచార్జ్ సందీప్ సహకారం అందిస్తున్నారని అలాగే శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు, నాయకులు అధికారులు అందరూ సహకరిస్తున్నారని తెలియజేసి భువనేశ్వరి వార్డు సమస్యలు నాగబాబుకు వివరించారు. సానుకూలంగా సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే... కఠిన చర్యలు

పంచగ్రామాల సమస్యపై త్వరలో నిర్ణయం

రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో భూ కబ్జాలపై ప్రత్యేక దృష్టిసారించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సుపరిపాలన ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు. విశాఖలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికంగా గత ప్రభుత్వంలో కబ్జా కాబడిన భూములకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. విశాఖలో జరిగిన భూకబ్జాలపై రెవెన్యూ విభాగం ప్రత్యేక రిపోర్ట్ తయారుచేస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నా మన్నారు. విశాఖలో ఎంతోకాలంగా ఉన్న పంచగ్రామాల సమస్యకు సంబంధించి త్వరలో పరిష్కారం అవుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో అవకాశాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగా విశాఖపట్నం ఐటీ హబ్ గా తయారు కాబోతోందని పేర్కొన్నారు. సాత్వ వంటి సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. ప్రేవేటు భూములు 22ఏలో పెట్టకూడదని సీఎం

చంద్రబాబు ఇప్పటికే చెప్పారని గుర్తు చేశారు. భూసమస్యకు కోసం ప్రత్యేక పాలసి తీసుకువచ్చి పరిష్కరించాలని ఆలోచన చేస్తున్నామన్నారు. త్వరలో విశాఖలో మెట్రో పనులు ప్రారంభం కానున్నట్లు మంత్రి వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం పై ఉన్న నమ్మకం తో పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు చూస్తున్నారని అన్నారు. గడచిన సంవత్సర కాలంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీఆర్ జెడ్ నిబంధనల ప్రకారం సముద్ర తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. ఎమ్మార్వో కార్యాలయాలు కొన్ని దూరంగా ఉన్న ఆర్డిఓ కార్యాలయం పరిధిలో ఉన్నాయని, ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం జనగణన జరుగుతున్న తరుణంలో బౌండరీలు మార్చే అవకాశం లేదన్నారు.

చంద్రబాబు సారథ్యంలో ఉత్తరాంధ్రకు అపూర్వ గౌరవం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఉత్తరాంధ్ర అభివృద్ధికి, నాయకత్వ ఎదుగుదలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంలో చొరవ చూపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదములు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు.భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. రాజరికం నుండి ప్రజాస్వామ్య పాలనలోకి అడుగుపెట్టిన పూసపాటి అశోక్ గజపతిరాజు మచ్చలేని నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ ఎంతో ఉన్నతమైన జీవితానికి నాంది పలికారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా, కేంద్ర మంత్రిగా ఉన్నా ఏనాడు రాజకీయాలను, పదవులను అడ్డుపెట్టుకొని దందాలు చేయలేదన్నారు. నేడు గోవా గవర్నర్‌గా నియమితులైనందుకు అశోక్ గజపతి రాజుకు నాయొక్క హృదయపూర్వక శుభాకాంక్షలు అని అన్నారు. నూతన ఒరవడిలో తెలుగు వారి కీర్తిని ఇనుమడింప చేయాలని కోరారు. అదేవిదంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఉత్తరాంధ్రకు ప్రత్యేకమైన గుర్తింపునీయడంలో టిడిపి ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. నాడు వాజ్ పాయి ప్రధానిగా కేంద్ర కేబినెట్ లో కింజరాపు ఎర్రంనాయుడు కేంద్ర మంత్రిగా పనిచేశారని అన్నారు. నేడు తన తనయుడు కింజరాపు రామ్మోహన్ నాయుడుబ్ నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్ర పౌరయాన శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని అన్నారు. ఇప్పుడు విజయనగరం జిల్లా నుండి రాజవంశీయులు పూసపాటి అశోక్ గజపతిరాజుని గోవాకి గవర్నర్ గా చేసింది తెలుగుదేశం పార్టీయేనని అన్నారు. ఉత్తరాంధ్ర నాయకులను ప్రత్యేకంగా గుర్తించడమే కాకుండా అభివృద్ధికి కూడా ఎక్కడా రాజీ పడకుండా టిడిపి అడుగులు వేస్తుందని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆశయాలను, అవసరాలను బాగా అర్థం చేసుకుంది మాత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడేనని అన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానశ్రయం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది టిడిపి పార్టీయేనని అన్నారు. అలాగే విద్య, వైద్య, రవాణా రంగాల్లో అధికమైన పెట్టుబడులు వస్తుంది కూడా ఉత్తరంధ్రకేనన్నారు. ఉత్తరాంధ్రపై ప్రత్యేకమైన దృష్టి పెట్టినందుకు గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని గంటా నూకరాజు అన్నారు.

ఆరోగ్య బీమా విషయంలో వృద్ధుల అనాసక్తి

ఎల్‌వీపీఈఐ లాన్సెట్ పరిశోధనలో వెల్లడి

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆరోగ్య భీమా పొందేందుకు వృద్ధులు తగినంత శ్రద్ధ చూపించడం లేదని, వృద్ధులలో బీమా తీసుకోవడం చాల తక్కువగా ఉందని, క్యాటరాక్ట్ చికిత్స తర్వాత బీమా లేకపోవడం వలన దృశ్య మాన్యత తగుతుందని, బీమా తీసుకోవడం వలన కంటి సంరక్షణ నాణ్యత పెరుగుతుందని లాన్సెట్ అధ్యయన ప్రధాన రచయిత, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ నేత్ర వైద్యులు డాక్టర్ బ్రిజేష్ టక్కర్, మరో అధ్యయన రచయిత డాక్టర్ రాజ్ నారాయణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్‌వీపీఈఐలో సోమవారం విడుదల చేసిన లాన్సెట్ పరిశోధన ఫలితాలపై వారు మాట్లాడుతూ భారత దేశంలో క్యాటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్ర చికిత్స చేయించుకున్న ప్రతి 20 మంది వృద్ధులలో కేవలం ముగ్గురు మాత్రమే ఆరోగ్య బీమా కలిగి ఉన్నట్లు ప్రముఖ వైద్య పత్రిక లాన్సెట్ పరిశోధన వెల్లడించిందన్నారు. ఆరోగ్య బీమా తగినంత కవరేజ్ ఉన్నప్పుడు మాత్రమే మెరుగైన చికిత్సలు ద్వారా మంచి దృష్టి ఫలితాలను అందించుటకు వీలవుతుందని తమ అధ్యయనం తెలుపుతుందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం కవరేజ్ ఉన్నప్పటికీ 80 ఏళ్ళ పైబడినవారు బీమా తీసుకోవటంలో అశ్రద్ధ కనపరుస్తు న్నట్లు ఈ అధ్యయనం వెల్లడించినదన్నారు. ఈఅధ్యయనం 70ఏళ్ళు పైబడిన సాధారణ క్యాటరాక్ట్ శస్త్రచికిత్స చేయించుకున్న దేశంలోని నాలుగు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక) నిర్వహించగా 38,387 మంది రోగులలో కేవలం 16.07 శాతం మంది మాత్రమే ఏదో ఒక రకమైన బీమా కవరేజ్ కలిగి ఉన్నట్లు గుర్తించటం జరిగిందన్నారు. ఈ బీమా కవరేజ్ కూడ వయసు పెరిగే కొలది తగ్గుతున్నాదని, ఈ లాన్సెట్ పత్రిక పరిశోధనలో వృద్ధులకు తగినంత ఆరోగ్య బీమా సదుపాయములు లేవని, వయసు పెరిగే కొలది బీమా పొందటంలో అసమానతలు చోటు చేసుకుంటున్నాయని వెల్లడయినట్టు చెప్పారు. ఇప్పటివరకు ఉన్న బీమా విధానాలు అందుబాటులో లేనివిగా, భరించలేనివిగా మరియు అప్రయోజనకరమైనవిగా వృద్ధులు భావిస్తున్నారన్నారు. ఇంకనూ అన్ని వయసులు కల స్త్రీలతో పోలిస్తే వృద్ధులైన పురుషులు అధిక బీమా తీసుకోవటం లింగ అసమానతను సుచిస్తున్నట్లు పేర్కొన్నాదన్నారు. ఆయుష్మాన్ వంటి ప్రభుత్వ పథకాలు ప్రవేశ పెట్టటం ద్వారా బీమా తీసుకోవడాన్ని గణనీయంగా పెంచాయని, ఇది ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ విధానం యొక్క సానుకులతను ప్రదర్శించటమే కాక నిరంతర బీమా కవరేజ్‌కి నిదర్శనం అన్నారు. క్యాటరాక్ట్ చికిత్స తర్వాత మెరుగైన దృశ్య ఫలితాలు బీమా కవరేజ్ పైన ఆధారపడి ఉంటాయని, ప్రైవేట్ బీమా రోగులతో పోలిస్తే ప్రభుత్వ బీమా తీసుకున్న రోగులు చికిత్స కోసం అనుమతి రావటం కోసం కొద్దిరోజులు వేచి ఉండాల్సిన సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు.

జివిఎంసి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 174 వినతులు

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీలో అన్ని విభాగాలకు కలిపి 174 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో జీవీఎంసీ కమీషనరు కేతన్ గార్గ్‌తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 174 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్‌కు 02, 2వ జోన్ కు 19, 3వ జోన్ కు 28, 4వ జోన్ కు 09, 5వ జోన్ కు 30, 6వ జోనుకు 45, 8వ జోన్‌కు 15, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 26 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 04, రెవెన్యూ విభాగమునకు 17, ప్రజారోగ్య విభాగమునకు 12, పట్టణ ప్రణాళిక విభాగమునకు 84, ఇంజినీరింగు విభాగమునకు 47, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 09 కలిపి మొత్తంగా 174 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం కమీషనరు మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదేరోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, సిసిపి ఏ.ప్రభాకర రావు డీసీఆర్ ఎస్. శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్లు పి.వి.వి. సత్యనారాయణ రాజు, కె.వి.ఎన్ రవి, కె.శ్రీనివాసరావు, గోవిందరావు, సంపత్ కుమార్, కృష్ణారావు, డిడిహెచ్ ఎం. దామోదర రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు డి. లక్ష్మి, పి.ప్రసన్న వాణి, డిపిఓ విజయశంకర్, శాంతి కుమారి, సివిఓ డాక్టర్ ఎస్. కిషోర్, డీసీపీలు హరిదాసు, రామ్మోహన్, ఏసీపీ లు తిరుపతిరావు, రామలింగేశ్వర రెడ్డి, వెంకటరావు, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎస్టేట్ ఆఫీసరు పి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలనీలో అక్రమ నిర్మాణాలను అరికట్టండి

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన కంటుబోతు సత్యవతి సోమవారం స్థానిక కలెక్టర్ ఆఫీసులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కృష్ణాపురం గ్రామంలో ప్రభుత్వ కాలనీలలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఫిర్యాదు చేశారు వివరాలు ఇలా ఉన్నాయి . పద్మనాభం మండలం, కృష్ణాపురం గ్రామ పంచాయతీ, రెవెన్యూలో సర్వే నెం.60-1రులో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కాలనీలో పట్టా నెం. 54రును క్రిష్ణాపురం గ్రామ కాపురస్తులు సురాల శివన్నారాయణ భార్య సురాల దుర్గాభవాని పేరున మంజూరు చేశారు. అయితే వాళ్ల సంబంధిత స్థలంలో కాకుండా నకిలీ పట్టా నెం. 276రును రాజకీయ, అధికార బలంతో అక్రమంగా నిర్మాణం చేశారు. ఇదే తంతు కొనసాగితే అక్రమార్కులు ఎక్కువైపోతారు. ఇదే విషయం మీద గతంలో పంచాయితీ సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి, మండల రెవెన్యూ వారి వద్ద విన్నించుకోగా ఎటువంటి ఫలితం రాలేదు. చర్యలు కూడా ఏమీ తీసుకోలేదు. అక్రమంగా నిర్మానం చేపట్టిన వీళ్లపై చర్యలు తీసుకోవాలని ,అక్రమ నిర్మాణాలు అరికట్టాలని ఫిర్యాదుల పేర్కొనడం జరిగినది.

మాటలతో కోటలు కట్టడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య

మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-తగరపువలస : జిల్లా వైసిపి పార్టీ ఉపాధ్యక్షులు (వైస్ యంపిపి) బోని బంగారు నాయుడు ఆధ్వర్యంలో లక్ష్మీపురం పంచాయతీ గల విజయరామపురం గ్రామంలో నిర్వహించిన "బాబు ఘారిటీ - మోసం గ్యారంటీ" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మజ్జి శ్రీనివాసరావుకి ప్రజలు మంగళ హారతులతో సాదర స్వాగతం పలికారు. పర్యటనలో బాగంగా గ్రామ ఇలవేలుపు "శ్రీరాముని సన్నిదిలో మెండైన ఆశీర్వాదాలు తీసుకున్నారు. మహిళా అక్కా చెల్లెళ్ళు ను ప్రజలను మీకు సూపర్ సిక్స్ పథకాలు సంపూర్ణంగా అందాయా అని మజ్జి శ్రీనివాసరావు అడుగగా లేదు - లేదు బాబుని నమ్మాం మోస పోయాం అంటూ ముక్త కంఠంతో పలికారు. మ్యాన్ ప్యాస్టో ను భగవద్గీత - బైబిల్ -ఖురాన్‌గా బావించి కులం మతం ప్రాంతం పార్టీ చూడకుండా ఎలాంటి వివక్ష లేకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ 90 శాతం వరుకూ అమలు చేసి పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం మెచ్చుకొని తన పాలన వైపు చూసేలా చేసిన గొప్ప నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అని విశాఖ జిల్లా వైసిపి పార్టీ ఉపాధ్యక్షులు వైస్ యంపిపి బోని బంగారు నాయుడు అన్నారు. అనంతరం తన ప్రియతమ నేత మజ్జి శ్రీనివాసరావు ని శాలువాలతో సన్మానించి అయన పై తమకు ఉన్న అబిమానాన్ని గ్రామ యువకులు కార్యకర్తలు చాటుకున్నారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వై.సి.పి. ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలు ఆర్థికంగా బలంగా ఉండాలని నమ్మి, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడి, మహిళలకు చేయూత అందజేసిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు కానీ నేడు కూటమి ప్రభుత్వం మహిళల ఆశలను ఆసరాగా తీసుకొని, అమలు కాని హామీలు ఇచ్చి, వాటిని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి ఆడబిడ్డకు ఆర్థిక సహాయం ఈ రాష్ట్రంలో ఉన్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క ఆడబిడ్డకు ?1500, దీపం పథకం ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు,తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ 15,000, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రాష్ట్రంలో మహిళలు ఎక్కడికి వెళ్లినా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి? ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగం లేని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి,పెన్షన్ పథకం 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పెన్షన్,ఇలా ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు ఎన్ని అమలు చేస్తారో మీరే తెలుసు కోవాలని,ఇటువంటి బూటకపు హామీలు ఇచ్చి, హామీలు అమలు చేయాలని ప్రజలు అడిగితే అడిగిన వారి నాలిక మందమని చంద్రబాబు అంటే హామీలు అమలు కాకపోతే ప్రశ్నిస్తానని చెప్పిన పవన్ కళ్యాణ్ ఎక్కడ కనిపించడం లేదని మండిపడ్డారు. అనంతరం కూటమి ప్రభుత్వము అమలుకాని హామీలు ఇచ్చిన 'బాబు షూరిటీ- మోసం గ్యారెంటీ' పేరుతో ఉన్న కరపత్రాన్ని చూపించి బాబు మోసాలు తెలియాలి అంటె ఈ క్యూ ఆర్ కోడ్ స్కేన్ చేసి చూస్తే మీకే తెలుస్తుంది అని ప్రజలకు వివరించారు. అనంతరం గడప గడపకు వెళ్ళి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత "పథకాలు అమలు చేయని పాలనను" ప్రజలకు వివరించడం చేసారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండలం వైసిపి పార్టీ శ్రేణులు-కార్యకర్తలు - అభిమానులు - గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విత్తన రాఖీలతో పర్యావరణ పరిరక్షణ

గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీఓ కార్యదర్శి జెవి రత్నం

విశాలాంధ్ర-పెందుర్తి : విత్తన రాఖీలతో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం పెందుర్తి ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో ఆయన విత్తన రాఖీలు తయారు చేయించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని, ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దు, ప్రభుత్వం నిషేధించిన వాటిని వాడొద్దు అని విద్యార్థులకు సూచించారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించుకుందామని, ఆరోగ్యంగా జీవిద్దామని ప్రజలకు ఉద్బోధించారు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ వార్డెన్ల అసోషియేషన్ అధ్యక్షులు ప్రకాష్ మాట్లాడుతూ పర్యావరణ హితంగా విత్తన రాఖీలు తయారు చేయడం ఆనందదాయకం అన్నారు. విద్యార్థులందరికీ పర్యావరణహితంగా జీవించడం నేర్పాల్సిన అవసరం మనపై ఉందన్నారు. చాలా వసతి గృహాల్లో ప్రకృతి ఆధారంగా పంటలు పండించుకునే ఆహారాన్ని భుజిస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ వసతి గృహాలు విద్యార్థులు అభ్యున్నతకు ఉపకరిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ ఎ సత్యవతి, వనమాలి, సిటిజి గార్డెనర్స్ గ్రూప్ ప్రతినిధి భాగ్య రేఖ, ఏక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ అనకాపల్లి ఫెసిలిటేటర్ ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ కోఆర్డినేటర్ జె రాజేశ్వరి పాల్గొన్నారు.

ది డిఫరెన్స్ ఈజ్ డైసన్' క్యాంపైన్ ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం : గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ డైసన్, తన డైసన్ బ్యూటీ అంబాసిడర్ దీపికా పదుకొనేతో కలిసి తన కొత్త 'ది డిఫరెన్స్ ఈజ్ డైసన్' క్యాంపెయిన్‌ను ప్రారంభించామని నేడు ప్రకటించింది. ఈ క్యాంపెయిన్ ద్వారా, అన్ని జుట్టు రకాల వ్యక్తులను ప్రత్యేకమైన సెల్ఫ్- ఎక్స్‌ప్రెషన్ ప్రభావాన్ని ఆస్వాదించమని, హీట్ డ్యామేజ్ లేకుండా పరిపూర్ణంగా స్టైల్ చేసుకున్న జుట్టును సాధించమని డైసన్ ఆహ్వానిస్తోంది. ఇది డైసన్ బ్యూటీ శ్రేణిని నిర్వచించే బహుముఖ ప్రజ్ఞను, పనితీరును హైలైట్ చేస్తూ, వినూత్న సాంకేతికత ద్వారా శిరోజాల ఆరోగ్యం పట్ల నిబద్ధతను డైసన్ పునరుద్ఘాటిస్తుంది. ఈ క్యాంపెయిన్ గురించి డైసన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అంకిత్ జైన్ మాట్లాడుతూ, "ది డిఫరెన్స్ ఈజ్ డైసన్" అనేది వ్యక్తిత్వాన్ని స్వీకరిస్తూ, ఉన్నతీకరించే క్యాంపెయిన్. ఇది డైసన్ ఆవిష్కరణ పట్ల నిబద్ధతను బలోపేతం చేస్తుంది. అన్ని రకాల జుట్టు రకాలకు, హీట్ డ్యామేజ్ లేకుండా ఉన్నతమైన స్టైళ్లను అందిస్తూ, వినియోగదారులకు హెయిర్ స్టైలింగ్ శ్రేణిని మరింత చేరువ చేస్తుంది. ఈ థీమ్‌కు ప్రాణం పోసుకోవడం, హెయిర్ స్టైలింగ్‌ను పునర్నిర్వచించడంలో దీపికా పదుకొనే టెక్నాలజీ ఫస్ట్ అనే మా విధానాన్ని ప్రదర్శించడం మాకు సంతోషాన్ని కలిగిస్తోంది" అని తెలిపారు.

పోలీస్ కమిషనరేట్లో పెట్రోల్‌తో వ్యక్తి హల్చల్

అదుపులో తీసుకున్న పోలీసులు...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ సోమవారం కాన్ఫరెన్స్ హాల్ వద్ద నిర్వహించిన వేపాడ పవన్ కుమార్ అనే వ్యక్తి పీజీఆర్ఎస్ వద్ద పెట్రోల్ తీసుకువచ్చి హల్చల్ చేశాడు. దీంతో సిబ్బంది ఆందోళన చెంది ఆయన్ను వారించారు. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకోబోతే అక్కడి పోలీస్ సిబ్బంది వారించి ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. సైబర్ సెక్యూరిటీ సెల్లో ఉద్యోగం ఇప్పిస్తానని పవన్ కుమార్ ను సంజయ్ రెడ్డి అనే వ్యక్తి నమ్మించాడు. రూ.7లక్షలకు పైగా వసూలు చేసి ఆపై మొహం చాటేశాడు.దీంతో తనకు న్యాయం చేయాలంటూ పవన్ పోలీసుల్ని ఆశ్రయించాడు. విచారించిన పోలీసులు సంజయ్ నుంచి కొంత మొత్తాన్ని పవన్కు ఇప్పటికే ఇప్పించారు. మిగతా మొత్తాన్ని త్వరలోనే తిరిగి ఇచ్చేస్తానని సంజయ్ హామీ ఇచ్చాడు. అయితే ఇన్నాళ్లవుతున్నా తనకు సొమ్ము తిరిగి ఇవ్వలేదంటూ పవన్ బలవన్మరణానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో పోలీసులు వారించి, త్వరలోనే సొమ్ము ఇప్పిస్తామని, లేదంటే బాధితుడు ఫిర్యాదిస్తే సంజయ్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరువర్గాలతోనూ మాట్లాడుతున్నామని పోలీసులు తెలిపారు.

ఏయూ రిజిస్ట్రార్‌కి టీఎన్టీయూసీ వినతి

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుని ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు నాడు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం కలసి పలు సమస్యలపై వినత పత్రం అందించారు. రెగ్యులర్ ఉద్యోగస్తులకు పెండింగ్ లో ఉన్న ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, యూనివర్సిటీలో ఒకే స్థానంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న వారిని అంతర్గత బదిలీలు చేయాలని, టైం స్కేలు మరియు 28 రోజులు ఉద్యోగస్తులకు రిటైర్మెంట్ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, క్యాంపస్‌లో రాజకీయ కార్యక్రమాలను నిలువరించాలని ఈ వనత పత్రంలో కోరారు. అదేవిధంగా ఉద్యోగులు మరణాంతరం టైం స్కేల్, 28 రోజులకి చెందిన ఉద్యోగస్తుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని కోరారు. దీంతోపాటు యూనివర్సిటీలో ఉన్న ఇతరత్రా సమస్యలు ప్రస్తావిస్తూ, వెంటనే పరిష్కరించాలని వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బండారు దేముడు, ఆవల రమేష్, టి. సాయి బలరాం తదితరులు పాల్గొన్నారు.

రెండవ ట్రాక్ 'సజ్ నా మేరా'ను విడుదల చేసిన రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్

విశాలాంధ్ర-విశాఖపట్నం : మెలోడీ మరియు హిప్ హాప్ ను మిశ్రమం చేసే విలక్షణమైన ఫార్మాట్ గా రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ను ముందుకు తీసుకువచ్చినట్టు ప్రతినిధి చెప్పారు. పెహలే జైసీ బాత్ నహీ, హుడీ, మొహబ్బత్, మరియు ఇంతిహాన్ వంటి ట్రాక్స్‌తో విజయవంతంగా నడిచిన, ఈ ప్లాట్‌ఫాం ఇప్పుడు ఈ సీజన్‌లో తమ రెండవ ఒరిజినల్ సజనా మేరాను ప్రారంభించిందన్నారు. నీతి మోహన్, పాంథర్ మరియు రావాటర్ నటించిన శక్తివంతమైన సహకారం. అత్యంత ఉత్సాహవంతమైన ఆన్-గ్రౌండ్ అనుభవాలతో గత మూడేళ్లకు పైగా వివిధ యువ కేంద్రాలు అంతటా ప్రేక్షకులను ఆకర్షించిన తరువాత, రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ తమ రెండవ సీజన్‌లో బూమ్ బాక్స్ ఒరిజినల్స్‌తో మళ్లీ వచ్చిందన్నారు. ఈ సౌండ్ ట్రాక్స్ బ్రాండ్ స్ఫూర్తి లివింగ్ ఇట్ లార్జ్ ను సంబరం చేస్తుందని తెలిపారు. రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్, బ్రాండ్ ఫ్లాగ్ షిప్ మ్యూజిక్ ఐ పీ యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్ సహకారంతో, రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ఒరిజినల్స్ ద్వారా తాజా శ్రేణితో తిరిగి వచ్చింది ఇది భారతదేశపు సంగీత ప్రపంచాన్ని పునర్నిర్వచించింది అని అన్నారు.

రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

బంటుబిల్లివారికళ్లాలు గ్రామ ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం

విశాలాంధ్ర-అనందపురం : మండలంలోని బంటుబిల్లివారికళ్లాలు గ్రామ ప్రజలు తమ గ్రామ రేషన్ డిపో డీలర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ఉన్న రేషన్ డిపో నెం.38కు సంబంధించి బంటుబిల్లి సత్య సుమంగళి గత 30 సంవత్సరాలుగా గ్రామంలో నివాసం లేకుండా ఇతర ప్రాంతంలో ఉంటున్నారని వారు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితిలో, గ్రామస్తులకు సమయానికి రేషన్ సరఫరా కాకపోవడంతో తీవ్ర అసౌకర్యాలు ఎదురవుతున్నాయని వారు వాపోయారు. ఇప్పటికే ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. తాజాగా జూలై 9న జరిగిన తనిఖీలో సివిల్ సప్లయ్ అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించినట్లు పేర్కొంటూ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు సకాలంలో రేషన్ సరుకులు అందించేలా చూడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ఫ్రెష్ బస్ ఎలక్ట్రిక్ బస్సుల్లో విశాఖపట్నం-విజయవాడ & గుంటూరు రూట్లలో స్లీపర్ సదుపాయ సేవలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : గత మాసం జూన్‌లో ఫ్రెష్ బస్ వారు విశాఖపట్నం-విజయవాడ-గుంటూరు మధ్యన సీటింగ్ సౌకర్యంతో ఎలక్ట్రిక్ వాహనాలు ప్రవేశ పెట్టారు. ప్రయాణికుల సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని ఈరోజు ఫ్రెష్ బస్ వారు ఎలక్ట్రిక్ వాహనాలను స్లీపర్ సదుపాయంతో ఆవిష్కరించారు. ఫ్రెష్ బస్ సుదీర్ఘ ప్రయాణాలకు కాస్త విరామమంగా మిడ్ పాయింట్ ఏర్పాటుచేస్తుంది. విశాఖపట్నం-విజయవాడ-గుంటూరు ఫ్రెష్ బస్‌నకు రాజమండ్రి వద్ద మిడ్ పాయింట్ ఏర్పాటుచేసి అక్కడ ప్రయాణికులకు రుచికరమైన తాజా ఆహారం, శుభ్రమైన వాష్ రూమ్ సదుపాయం కలిగిస్తున్నది. ఈ ఇంటర్ సిటీ ఫ్రెష్ బస్ ఆవిష్కరణ ప్రయాణికుల ఆలోచనలకు అనుగుణంగా వారికి నిరంతర సేవలు అందించుటను దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం -విజయవాడ-గుంటూరు మధ్యన ఎలక్ట్రిక్ స్లీపర్ బస్సును ప్రవేశపెట్టటం తమకు చాల సంతోషంగా ఉంది అన్నారు ఫ్రెష్ బస్ వ్యవస్థాపకులు మరియు సీఈఓ సుధాకర్ చిర్రా ఈ కీలకమైన మార్గంలో సుదూర ప్రయాణాలు మరింత సౌకర్యంగా ప్రయాణికులు కొనసాగించుటకు ఈ స్లీపర్ సదుపాయం కలిగించుట ద్వారా ఫ్రెష్ బస్ మరో ముందడుగు వేసింది అన్నారు. ఈ ఫ్రెష్ బస్ స్లీపర్ ప్రయాణం అత్యంత పరిశుభ్రతను కలిగి ఉంటుందని, మార్గ మధ్యలో రాజమండ్రిలో ఆగినపుడు ప్రయాణికులకు తాజా వేడి భోజనం రుచి చూడటమే కాక కాస్త విశ్రాంతి కూడ తీసుకోవచ్చునని ఆయన చెప్పారు. ఇది ఒక ప్రయాణంలా కాక చక్కని విహార యాత్ర అనుభూతి కలిగిస్తుంది అన్నారు. ఫ్రెష్ బస్ ప్రయాణాలను ప్రయాణికుల అభిరుచి మరియు సంతృప్తిని దృష్టిలో ఉంచుకుని సుస్థిరంగా మరియు సదుపాయకరంగా నిర్వహించడమే తమ లక్ష్యమని సుధాకర్ చిర్రా ఈ సందర్భంగా వివరించారు. ఫ్రెష్ బస్ టికెట్ డిజిటల్ బుకింగ్ దగ్గర నుంచి బస్సు చిట్ట చివరి గమ్యస్థానం వరకు ప్రయాణంలోని ప్రతి అంశము ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేసామని, ప్రయాణికులు ఈ సౌకర్యాలను ఆనందంగా ఆస్వాదిస్తారని ఆయన అన్నారు. అన్ని ఫ్రెష్ బస్ ఎలక్ట్రిక్ బస్సులు పరిశుభ్రంగా నిశ్శబ్దంగా పనిచేసే ఎయిర్ కండీషన్ క్యాబిన్‌లతో మరియు పర్యావరణ స్నేహ పూరితమైన ప్రయాణాలకు అనుకూలం. పరిశుభ్రమైన & విశాలమైన స్లీపర్ బెర్త్‌లు. ప్రయాణంలో ఉచిత స్నాక్స్ మరియు పానీయాలు. శిక్షణ పొందిన యూనిఫాం ధరించిన ఫ్రెష్ బస్ సిబ్బంది విలువైన సేవలు అందిస్తారు. ప్రతి బస్సు ప్రయాణం ఒక అద్భుతంగా మంచి విలువలతో సాగాలనే ఆలోచనలతో ప్రయాణికులకు లాయల్టీ అందిస్తున్నాది. ప్రతి వంద కిలోమీటర్ల ప్రయాణానికి 10 గ్రీన్ కాయిన్స్ అందిస్తున్నాది. ప్రయాణికులు వీటిని తమ తదుపరి ప్రయాణ టిక్కెట్ల కొనుగోలు సమయంలో ఉపయోగించవచ్చును. విశాఖపట్నం-విజయవాడ & గుంటూరు మరియు ఇతర ఫ్రెష్ బస్ రూట్ల టిక్కెట్లు freshbus.com లేదా ఫ్రెష్ బస్ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. తరుచుగా ప్రయాణించే వారు 10 రైడ్‌లలో ఒక్కో రైడ్‌కు రూ.50/- ఆదా చేసుకోవడానికి ఫ్రెష్ కార్డును కొనుగోలు చేయవచ్చునని ఈ కార్డు ఆరు నెలలు పాటు చెల్లుబాటులో ఉంటుందని వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు రాక వేగం పుంజుకుంటున్నందున ఫ్రెష్ బస్ భారతదేశం అంతటా ప్రయాణాలు కొనసాగించుటకు కట్టుబడి ఉంది అన్నారు.

మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు కుమారుని పెండ్లి పిలుపు

విశాలాంధ్ర-పద్మనాభం : మాజీ మంత్రి, మాజీ భీమిలి శాసనసభ్యులు అవంతి శ్రీనివాసరావు కుమారుడు సందీప్ పెండ్లి పిలుపు కార్యక్రమంలో భాగంగా పద్మనాభం మండలంలోని ప్రతి పంచాయతీలో ఉన్న నాయకులకు, అభిమానులకు అవంతి మహేష్ పెండ్లి పిలుపు ఆహ్వాన పత్రికలను అందజేశారు. అవంతి మహేష్‌తో పాటు మండలంలోని స్థానిక నేతలు అభిమానులు అవంతి మహేష్ ని కలుసుకొని అభినందనలు తెలియజేశారు. ప్రతి ఒక్కరికి వారి గ్రామానికి వారి ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రిక ఇవ్వడం జరిగింది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనే ఆస్తి పన్నుల పేరు మార్పు

- ఆగస్టు 1 నుంచి ప్రక్రియ ప్రారంభం
- ఆస్తి పన్ను పేరు మార్పుకై జీవీఎంసీ కి దరఖాస్తులు అవసరం లేదు
- జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆస్తులు రిజిస్ట్రేషన్ జరిగే ప్రక్రియలోనే ఆస్తి పన్నుల పేరు మార్పు జరిపే విధానాన్ని ప్రజల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే ఇకపై ఆస్తి పన్నులు పేరు మార్పు జరిగే విధి విధానాలపై రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ డిఐజి జి. బాలకృష్ణ, జీవీఎంసీ డిసిఆర్ ఎస్. శ్రీనివాసరావు, లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో భూములు, భవనములు, అపార్ట్మెంట్లు కొనుగోలు ప్రక్రియలో భాగంగా ఇకపై సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని జీవీఎంసీ అసెస్మెంట్ కలిగిన ఆస్తులకు ఆస్తి పన్నుల పేరు మార్పు ఆటోమేటిక్ గా జరిపే అవకాశాన్ని ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం కల్పించిందని ఆయన అన్నారు. సంబంధిత ఆస్తులు రిజిస్ట్రేషన్ జరిగిన అనంతరం ఇకపై జీవీఎంసీ కార్యాలయానికి రాకుండానే ఎటువంటి దరఖాస్తు, దస్తావేజులు ఇవ్వకుండానే ఇంటి పన్నుల పేరు మార్పు చేసుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ ప్రక్రియ ఆగస్టు 1, 2025 నుండి జీవీఎంసీ పరిధిలో అమలవుతుందన్నారు. ఆస్తులు కొనుగోలు సమయంలో కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ సమయంలోనే సంబంధిత సబ్-రిజిస్టర్ కార్యాలయంలో ఆస్తి పన్ను పేరు మార్పుకు సంబంధించి జీవీఎంసీ కి చెల్లించవలసిన మ్యుటేషన్ చార్జీలు చెల్లించవలసి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే జీవీఎంసీ రికార్డులలో ఆటోమేటిక్ గా ఆస్తి యజమాని పేరున ఆస్తి పన్ను పేరు మార్పు జరుగుతుందన్నారు. అసెస్మెంట్ నెంబర్ కలిగి రిజిస్ట్రేషన్ జరిగిన ఆస్తులకు, ప్లాట్లకు ఈ విధానం వర్తిస్తుందన్నారు. ఈ విధానం ద్వారా నగర ప్రజలు అత్యంత విలువైన సమయం ఆదాతో పాటు జీవీఎంసీ లేదా జోనల్ కార్యాలయాల వద్దకు వెళ్లవలసిన అవసరం ఉండదని, కావున నగర ప్రజలు ఈ అద్భుత సౌలభ్యం గమనించేలా జీవీఎంసీ రెవెన్యూ విభాగం ,రిజిస్ట్రేషన్ కార్యాలయాల అధికారులు, ఉద్యోగులు అందరికీ అవగాహన కల్పించాలని

అదనపు కమిషనర్ తెలిపారు. అనంతరం రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ డిఐజి జి.బాలకృష్ణ, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస రావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరగబోయే రిజిస్ట్రేషన్ కు సంబంధించి ఆస్తిపన్నుల పేర్లు మార్పు జరిగే ప్రక్రియపై రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చిన వారికి, అలాగే జీవీఎంసీ పరిధిలో గల ఆస్తి పన్నుదారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సబ్ రిజిస్ట్రర్లకు ,జీవీఎంసీ రెవెన్యూ అధికారులకు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర రావు, అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు జివిఎంసి రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జీవీఎంసీ పరిధిలోని సబ్ - రిజిస్ట్రర్లు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు ఏడు అర్జీలు

విశాలాంధ్ర-భీమిలి : జోన్-1 జివిఎంసి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంకు 07 అర్జీలు వచ్చినవి. యుసిడి విభాగానికి-01, పట్టణ ప్రణాళిక విభాగానికి-02, ప్రజారోగ్యం విభాగానికి-02, ఇంజనీరింగ్ విభాగానికి-02, తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందని జోనల్ కమిషనర్ తెలిపారు.